క్లుప్తంగా

లలితాదేవికి చీరల అలంకరణ


చీరలతో అలంకరించిన లలితాదేవి

ఏలూరు (ఆర్ ఆర్‌పేట): నగరంలోని ఆదర్శ ఆంజనేయ స్వామి ఆలయంలో వేంచేసియున్న లలితాదేవి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కుంకుమ పూజలు చేసి నిత్యార్చనలు చేశారు. భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు నిర్వహించి లలితా సహస్రనామ పారాయణ నిర్వహించారు. అమ్మవారికి 108 నారాయణపేట చీరలతో విశేషంగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక కిరీటం, ఛత్రాలతో అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పెదపాడు: అభయాంజనేయస్వామి ఆలయంలో ఆలయ కమిటీ అన్నదానం నిర్వహించడం మంచి పరిణామమని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని అప్పనవీడు అభయాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం పురస్కరించుకుని అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి సన్నిధిలో నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ పాల్గొన్నారు. తొలుత స్వామివారికి అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదాన వితరణ చేసిన పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులను ఆలయ అర్చకులు రామాచార్యులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన కనక దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ఆళ్ల సతీష్ చౌదరి, ఎంపీటీసీ బుద్దే రామసీత, స్థానిక సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, వట్రపు కోటి రెడ్డి, గుణుపూరు మహేష్ పాల్గొన్నారు.

మాలాధారులకు ఉచిత భిక్ష


అయ్యప్ప మాలాధారులకు ఆహారం వడ్డిస్తున్న గురు స్వామి వెంకటేశ్వరరావు తదితరులు

పెదవేగి : అయ్యప్ప, భవానీ మాలాధారులకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సౌజన్యంతో ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారని గురుస్వామి చళ్లగొళ్ళ వెంకటేశ్వర రావు చెప్పారు. పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలోని కొఠారు అబ్బయ్య మెమోరియల్ శ్రీ షిర్డీ సాయి చారిటబుల్ ట్రస్ట్ భవనంలో మాలధారులకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం వడ్డిస్తామని గురుస్వామి తెలిపారు. ఈనెల 16 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం 43 రోజులపాటు కొనసాగుతుందని ఈ అవకాశాన్ని భవానీ, అయ్యప్పస్వామి మాలాధారులకు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

విజిలెన్స్ దాడులు

కామవరపుకోట: స్థానిక భాగ్యలక్ష్మి పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ షాపుపై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఏ విధమైన పత్రాలు లేని రూ.5,94,014 విలువ కలిగిన పురుగుమందులను, వేరొక గొడానులో రూ.3,99,646 విలువ కలిగిన పురుగుమందులను, మొత్తంగా 23 రకాల పురుగుల మందులను స్వాధీన పరుచుకుని షాపు యజమాని గుల్ల శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్ తెలిపారు. జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.కుమార్ ఆదేశాల మేరకు మండల వ్యవసాయ అధికారి సి.పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించినట్లు చెప్పారు.

గడప వద్దకే ప్రభుత్వ పాలన

ఎమ్మెల్యే ఆళ్ల నాని


మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాని, మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్: దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ఏపీలో గడప వద్దకే ప్రభుత్వ పాలన తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరులో 117వ రోజు మంగళవారం 34వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే నాని ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలు ప్రజలకు ఏవిధంగా అందుతున్నాయో ఆరా తీశారు. అవ్వాతాతలను పింఛన్ సక్రమంగా అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ గ్రామస్వరాజ్యాన్ని నిజం చేస్తూ ప్రజలకు ప్రభుత్వ పాలన చేరువ చేశామన్నారు. ప్రతి రెండు వేల కుటుంబాలకు ఒక సచివాలయం ఏర్పాటు చేసి, 10 మంది శాశ్వత ఉద్యోగులను నియమించి, వారిద్వారా ఇంటి సమీపంలోనే ప్రభుత్వ సేవలు అందించటం బహుశా దేశ చరిత్రలో ఇదే ప్రథమంగా నిలుస్తుందని నాని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేస్తోన్న సంక్షేమ పాలన దేశానికే ఆదర్శకంగా నిలుస్తోందన్నారు. ఏలూరు నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, స్థానిక సమస్యలను సైతం దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఏలూరు నగరవాసులకు తమ్మిలేరు ముంపు నుంచి శాశ్వత పరిష్కారం కల్పించామని నాని గుర్తు చేశారు. నానికి తొలుత కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, నాయకులు అంబికా రాజా, అదనపు కమిషనర్ బాపిరాజు, తహసీల్దార్ సోమశేఖర్, కార్పొరేటర్లు, పార్టీ నేతలు ఉన్నారు.

వృద్ధులకు ఉచిత న్యాయ సహాయం


సదస్సులో మాట్లాడుతున్న మేరీ గ్రేస్ కుమారి

ఏలూరు (టూటౌన్): వృద్ధులకు న్యాయసేవాధికార సంస్థలు ఉచిత న్యాయ సహాయం అందిస్తాయని పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి అన్నారు. స్థానిక కోట దిబ్బలోని ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. శాశ్వత న్యాయ పీఠం అందించే సేవలు, లీగల్ సర్వీసెస్ అందించే ఉచిత సేవలపైనా అవగాహన కల్పించారు. రవాణా, పోస్టల్, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, విద్య, వైద్య, జాతీయ ఉపాధి హామీ పథకం, రియల్ ఎస్టేట్ మొదలైన సేవల్లో లోపం జరిగిన కేసులను శాశ్వత లోక్‌అదాలత్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దీనికి ఎటువంటి రుసుమూ వసూలు చేయరని తెలిపారు. కక్షిదారులకు కౌన్సిలింగ్ నిర్వహించి రాజీచేయడం లేదా సాక్షులను విచారించి తీర్పు ఇవ్వడం చేస్తారని వివరించారు. ఈ తీర్పులకు అప్పీల్ ఉండదని తెలిపారు. కార్యక్రమంలో పర్మినెంట్ లోక్‌అదాలత్ సభ్యులు రామమోహనరావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.ఆంజనేయులు, కార్యదర్శి కె.మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష కొల్లేరు ప్రజలకు వరం


రోగులకు బీపీ, రక్త పరీక్షలు చేస్తున్న వైద్యులు


రోగులకు మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

పెదయాగనమిల్లిలో 106 మందికి వైద్య పరీక్షలు

ఏలూరు రూరల్: పేదలకు వైద్యం అందించాలనే మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సంకల్పాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవంతంగా కొనసాగిస్తున్నారని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం కొల్లేరు గ్రామం పెదయాగనమిల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటుచేశారు. వైద్యులు 106 మంది ఆరోగ్యాన్ని పరీక్షించారు. రక్త, బీపీ, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు, హెల్త్ రిపోర్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష ద్వారా కొల్లేరు గ్రామాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బలే నాగసులోచన, ఉపసర్పంచ్ సైదు విజయలక్ష్మి, తహసీల్దార్ ఆర్ శ్రీనివాసరావు, కార్యదర్శి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు


అన్నపూర్ణ దేవి అలంకరణలో సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి


కాత్యాయినీ దేవిగా పవర్‌పేట అన్నపూర్ణమ్మ


పవర్‌పేట వాసుదేవాలయంలో కాశీ అన్నపూర్ణేశ్వరీ దేవిగా రాజ్యలక్ష్మి


పత్తేబాదలో అన్నపూర్ణదేవిగా కనకదుర్గ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం వివిధ ప్రాంతాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో నిత్యపూజలు, కుంకుమ పూజలు, లలితా సహస్రనామ పారాయణలు, దేవీ ఖడ్గమాల పారాయణలు నిర్వహించారు. పవర్‌పేట కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారికి ఉభయ దాతలచే అలంకార పూజ చేశారు. భక్తుల గోత్ర నామాలతో సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి కాత్యాయిని దేవి అలంకరణ చేశారు. హారతి సేవ నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం సామూహిక శ్రీ కాత్యాయని వ్రతాలు నిర్వహించారు. లలితా సహస్రనామ పారాయణ, అమ్మవారికి విశేష హారతి సేవ, వేద స్వస్తి, దర్బారు సేవ చేశారు. అర్చకులు కందుకూరి రామ బ్రహ్మానందశర్మ విశేష పూజలు చేయగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం రామాంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. పవర్‌పేట వాసుదేవాలయం ప్రాంగణంలోని రాజ్యలక్ష్మి అమ్మవారికి ఉదయం క్షీరాభిషేకం, ఉభయ దాతలచే విశేష పూజలు, నిత్య పూజలు చేశారు. అమ్మవారికి శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరీ దేవి అలంకరణ చేశారు. బాలభోగ వినియోగం, సాయంత్రం లక్ష్మి, లలితా సహస్రనామ పారాయణ చేశారు. అనంతరం విశేష హారతులు, ఏకాంత సేవ నిర్వహించారు. అర్చకులు కందుకూరి వేంకట విజయ్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో అమ్మవారికి అన్నపూర్ణ దేవి అలంకరణ చేసి మల్లెపూలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు హరికథా భాగవతారిణి సప్పా బారతి హరికథా కాలక్షేపం చేశారు. నగరానికి చెందిన నాట్యాచార్య దువ్వి హేమసుందర్ శిష్య బృందం కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. పత్తేబాద కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి అన్నపూర్ణ దేవి అలంకరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు కార్యక్రమాలు పర్యవేక్షించారు. సత్రంపాడు సౌభాగ్యలక్ష్మికి అన్నపూర్ణ దేవి అలంకరణ చేశారు.

ప్రజా సమస్యలపై ఇంటింటా సర్వే


దెందులూరు యాదవుల వీధిలో ఇంటింటా సర్వే చేస్తున్న ప్రజాప్రతినిధులు

దెందులూరు: స్థానిక యాదవుల వీధిలో ప్రజా సమస్యలపై వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సర్వే నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, విజయవాడ కనకదుర్గమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, ఎంపీటీసీలు తోట విజయకుమారి, తాళ్ళూరి నాగరాజు, ఆనంద్, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటా సర్వేలో పాల్గొన్నారు. డ్రెయినేజీ, ఇళ్ల స్థలాలు, ఇతర సమస్యలను ప్రజాప్రతినిధులకు, స్థానికులకు చెప్పారు. యాదవుల వీధిలో స్థానికులు తెలిపిన సమస్యలను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి తెలియజేస్తామని వారు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ వీరాంజనేయులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో సూర్య కాలేజీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు శంకుస్థాపన చేశారు. రూ. 87 లక్షల మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, కౌన్సిలర్లు తాతకుంట్ల నాగలక్ష్మి, చింతలపూడి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తాతకుంట్ల రవి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ చింత అనిల్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

కామవరపుకోట: తడికలపూడిలో సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులను ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ, జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ కడిమి రమేష్ మంగళవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.10 లక్షల నిధులతో సీసీ డ్రెయినేజీ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు జెడ్పీటీసీ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలందించడమే లక్ష్యం


పెదపాడు: నాయుడుగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ



పెదవేగి: రామశింగవరం జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ తాతా రమ్య


దెందులూరు: మేధినరావుపాలెంలో మందుల కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, కామిరెడ్డి నాని

పెదపాడు: ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని నాయుడుగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ఆళ్ల సతీష్‌చౌదరి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపి, స్థానిక సర్పంచ్ సిద్దాబత్తిన జోజమ్మ, ఎంపీటీసీ మారుమూడి కృపామణి, స్థానిక నాయకులు బత్తుల ఏసురాజు, గుణుపూరు మహేష్, కట్నేని తులసీరామ్, తహసీల్దార్ జీ విజయకుమార్‌రాజు, ఈఓఆర్డీ సాధనాల సూర్యకుమార్, ఏ సీడీపీఓ ఎం సునీల్ రాజశేఖర్, వైద్యులు డాక్టరు చక్రధర్ డాక్టరు పాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ ఫాతిమా మున్నీషా బేగమ్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ

పెదవేగి : ప్రజల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించారని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అన్నారు. మంగళవారం మండలంలోని రామశింగవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి తాతా రమ్య ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్‌ను ఆమె పరిశీలించి, శిబిరంలో మందుల కిట్లను రోగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ, ఎంపీపీ తాతా రమ్య, ఎంఈఓ2 అరుణ్‌కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ శాంతారత్నం, సచివాలయ కార్యదర్శి, డాక్టర్లు మాధవి, భాగ్యశ్రీ, ప్రత్యూష, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతోనే అభివృద్ధి

దెందులూరు: జగనన్న ఆరోగ్య సురక్షతోనే ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం, అభివృద్ధి సాధ్యపడుతుందని జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. మంగళవారం మేధినరావుపాలెం గ్రామ సచివాలయంలో సర్పంచ్ మనుబోలు దుర్గాకుమారి రాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడికొండ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ అంగడాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 498 మంది లబ్ధిదారులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

ద్వారకాతిరుమల: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ద్వారకాతిరుమల వసంత్‌నగర్ కాలనీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి, క్షేత్రానికి విచ్చేసిన సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను వారు పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార శిబిరాన్ని సందర్శించారు. అనంతరం పలువురికి జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో లబ్ధిదారులకు నేరుగా (డీబీటీ) సుమారు రూ.3 లక్షల 15 వేల కోట్ల సంక్షేమ ఫలాలను జమచేసినట్టు చెప్పారు. పేదల ఆరోగ్య పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అందులో భాగంగానే ప్రతి గ్రామం, వార్డుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా, జనరల్ వైద్యులతో పాటు స్పెషలిస్టులను సైతం అందుబాటులో ఉంచి వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. కొమ్మినేని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తెచ్చిన పలు సంస్కరణల ఫలాలు పేదలు, మధ్యతరగతి వారికి ఎంతో మేలు చేస్తున్నాయని, వాటిని బట్టి రాష్ట్రానికి ముున్ముందు జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఎంతైనా ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో మహిళా శిశువు ఆరోగ్యానికి అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు, సిబ్బంది చేస్తున్న సేవలను కొమ్మినేని అభినందించారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అచ్యుత ఏసుబాబు, సర్పంచ్ కుంటం స్వర్ణలత, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, శ్రీవారి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, జి.కొత్తపల్లి పార్టీ ప్రెసిడెంట్ దాసరి ఏసురత్నం, తిరుమలంపాలెం సొసైటీ చైర్‌పర్సన్ బోగరాజు చిన్ని, ఉక్కుర్తి వెంకట్రావు, దాకారపు అగ్గియ్య, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	19
డీ.తిరుమల ఏలురు బీహెచ్ఈఎల్	22.15	29
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	30
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	12
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	19
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	22
ఏలూరు బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	32
ఏలూరు -తిరుపతి	16.00	4830	30

పశువుల రవాణాపై కేసు

జంగారెడ్డిగూడెం: స్థానిక బైపాస్‌రోడ్డు ఎస్సార్ పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఎటువంటి పత్రాలు లేకుండా అనకాపల్లి నుంచి హైదరాబాద్ కబేళాకు గిత్తదూడలను తరలిస్తుండటాన్ని గుర్తించి ఆ వాహనాన్ని సీజ్ చేశారు. 17 గిత్తదూడలను తమ్మినాడు గోసంరక్షణా సేవాసమితి నిర్వహిస్తున్న గోశాలకు తరలించి, వాహనంలోని ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి సబ్‌స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. ఏ పోలవరానికి చెందిన దుర్గాప్రసాద్, లక్ష్మీనారాయణ అనే ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై జీలుగుమిల్లి వెళ్తుండగా అశ్వారావుపేటవైపు నుంచి జంగారెడ్డిగూడెం వైపు వస్తున్న కారు ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో గాయాలపాలైన యువకులను 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.